
సాక్షి
పల్నాడు
బుధవారం, 16, అక్టోబర్, 2024



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29840 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 36868 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 6,182 క్యూసెక్కులు వదిలారు.

వీరాంజనేయస్వామికి వెండి సర్వాంగం



నగరంపాలెం: పాతగుంటూరులోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా చిరుమామిళ్ల వెంకటకృష్ణారావు, లక్ష్మి దంపతులు స్వామి వారికి నూతన వెండి సర్వాంగం సమర్పించారు.

న్యూస్‌రీల్

పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గొట్టిపాటి నియామకం



నరసరావుపేట: పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు తాత్కాలిక ఇన్‌చార్జిగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యవహరించారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నిర్వహించాల్సిన ఎంపిక పోటీలు వాయిదా పడిన విషయం విదితమే. గురువారం నందిగామ జెడ్పీ హైస్కూల్‌లో అండర్-14 బాల బాలికల ఫుట్‌బాల్, 18న శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇండోర్ స్టేడియంలో అండర్-14, అండర్-17 బాల బాలికల బ్యాడ్మింటన్, 19న రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్‌లో అండర్-14 బాల బాలికల సాఫ్ట్‌బాల్, పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌లో అండర్-14, అండర్-17 బాలుర బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు అదే రోజు ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని తెలిపారు.

జెడ్పీని సందర్శించిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ 5వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మంగళవారం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించారు. కమిషన్ సభ్యులు ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ఎంపీఎస్ పద్మారావు, కె.కృపారావు, తాజుద్దీన్ జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృషితో సమావేశమై జెడ్పీ వార్షిక బడ్జెట్ రూపకల్పన, ఆదాయ, వ్యయాల వివరాలు, ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ పనితీరు, ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్థిక అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ప్లానింగ్ విభాగ ఏవో జె.శోభారాణి, డి సెక్షన్ ఏవో డి.రామకోటయ్య, హెచ్ సెక్షన్ ఏవో ఎల్ఎస్‌టీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు కలాం ఆదర్శం



ఏఎన్‌యూ: అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం విశ్వవిద్యాలయంలోని కలాం విగ్రహానికి యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత లక్ష్య సాధనకు పేదరికం అడ్డుకాదనే సత్యాన్ని కలాం మనకు నిరూపించారన్నారు. శాస్త్రవేత్తగా, సాంకేతిక రంగ నిపుణుడిగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి ఎంతో విలువైన సేవలు అందించారని కొనియాడారు. రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి మాట్లాడుతూ కలాం రక్షణ రంగంలో అందించిన విలువైన సేవలు ఈ జాతి ఎప్పటికీ మరచిపోలేదన్నారు. ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య సిద్దయ్య, సీడీఈ డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్‌వీ కృష్ణారావు, సీఈ ఎ.శివప్రసాదరావు, వికాస కార్యదర్శి కె. శ్రీనివాసరావు పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఏలకు స్టాఫ్‌నర్సులుగా ప్రమోషన్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో మంగళవారం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్)కు ప్రమోషన్ కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపీహెచ్ఏలుగా పనిచేస్తున్న ఎనిమిది మందికి స్టాఫ్‌నర్సులుగా ప్రమోషన్ ఇచ్చారు. నలుగురు గుంటూరు జీజీహెచ్ స్టాఫ్‌నర్సులుగా ప్రమోషన్ తీసుకోగా, ఇరువురు ఒంగోలు, ఒకరు నెల్లూరులో, మరొకరు జ్వరాల ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులుగా పదోన్నతి పొందారు.

వాటా తేలేకే వ్యాపారం

జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. అడిగినంత ఇవ్వాల్సిందేనని బెదిరింపులు.. తమవారికి దుకాణాలు అప్పగించాలని వేధింపులు.. తమ వాటాలు తేలిన తర్వాతే వ్యాపారాలు చేసుకోవాలని ప్రజాప్రతినిధులు తేల్చి చెబుతున్న పరిస్థితులు.. వీటన్నిటి నడుమ తేలని మద్యం పంచాయితీల పర్వంతో ప్రారంభం కావాల్సిన దుకాణాల్లో సగం కూడా నేడు తెరుచుకోవడం అనుమానంగా మారింది.

- నగదు ముట్టజెప్పిన తరువాతే దుకాణాలు తెరవాలని హుకుం
- తటస్థులకు దక్కిన దుకాణాలనూ దక్కించుకునేందుకు బెదిరిస్తున్న సిండికేట్‌లు
- సత్తెనపల్లి నియోజకవర్గంలో తాను చెప్పిన వ్యక్తికి రూ.30 లక్షలు ఇవ్వాల్సిందేనన్న ప్రజాప్రతినిధి
- చిలకలూరిపేటలో స్థానికేతరుల దుకాణాల్లో 50 శాతం వాటా ఇవ్వాలని పట్టు
- కొలిక్కిరాని నరసరావుపేట లిక్కర్ పంచాయితీ
- 20 శాతం వాటా కోసం పెదకూరపాడులో వేధింపులు

మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిని భయపెడుతున్న ప్రజాప్రతినిధులు



ధరలు పెంచాల్సిందే...?

దుకాణాల నిర్వహణకు.. ఎమ్మెల్యేలకు పెద్ద మొత్తంలో కప్పం కట్టాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో వ్యాపారం చేస్తే సాధ్యం కాదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో సిండికేట్‌గా మారి ఒక్కో క్వార్టర్ బాటిల్ ఎంఆర్‌పీ కంటే రూ.20 అధికంగా విక్రయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు కూడా తాము అడిగినంత ఇస్తే వ్యాపారులకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీలు గుప్పిస్తున్నట్లు సమాచారం. చివరికి ప్రజాప్రతినిధుల మామూళ్లు మందుబాబుల జేబులకు చిల్లుపడేలా చేయనుంది.

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో మద్యం వ్యాపారులపై అధికారపార్టీ బెదిరింపులు పరంపర కొనసాగుతోంది. అదృష్టం లాటరీ రూపంలో వరించినా టీడీపీ నేతల నుంచి వేధింపులు తప్పడం లేదు. దీంతో వ్యాపారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. తాము చెప్పినట్టు వినకపోతే వ్యాపారం చేయనివ్వబోమంటూ కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి దుకాణాలు ప్రారంభం కావాల్సి ఉన్నా ప్రజాప్రతినిధుల వాటాలు తేలకపోవడంతో ప్రక్రియ ముందుకుసాగడం లేదు. దుకాణాలు తెరవడానికి ఒకటి రెండురోజులు పట్టొచ్చని దుకాణదారులు అభిప్రాయపడుతున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు దుకాణాలలో పెట్టుబడిలేకుండా వాటాలు కోరుతుండగా, మరికొందరు ఒకేసారి పెద్దమొత్తంలో నగదు చెల్లించి వ్యాపారాలు ప్రారంభించమంటున్నారు. జిల్లాలో 129 మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయించారు. ఎక్సైజ్ అధికారులు వ్యాపారులందరికీ తాత్కాలిక లైసెన్స్‌లను జారీ చేశారు. అయితే దుకాణాల తెరవడానికి టీడీపీ నాయకులు అడ్డుపడుతుండటంతో వీటిలో సగం దుకాణాలు బుధవారం తెరుచుకొనే పరిస్థితిలేదు.

కొనసాగుతున్న మంతనాలు..

మద్యం సిండికేట్ సభ్యులకు కాకుండా లాటరీ విధానంలో దుకాణాలు పొందిన వ్యాపారులతో టీడీపీ నేతలు మంతనాలు జరుపుతున్నారు. స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవడం కష్టమని, సిండికేట్‌లో కలసి వ్యాపారం చేయాలని బెదిరిస్తున్నారు. మరోవైపు ప్రజాప్రతినిధులు సైతం దుకాణదారులంతా సిండికేట్ కావాల్సిందేనని ఆదేశాలు జారీచేస్తున్నారు. సిండికేట్ అయితే తమకు రావాల్సిన నగదు ఒకరి వద్దే తీసుకోవచ్చన్న ఆలోచనలో ఉన్నారు.

- నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని దుకాణాల ఏర్పాటు పంచాయితీ ఇంకా తేలలేదు. దుకాణాలలో వాటా ఇప్పిస్తామని సుమారు 50 మంది నుంచి ఇప్పటికే కొంత మొత్తాన్ని టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఒకరు సేకరించారు. అయితే లాటరీలో వారికి ఆశించిన స్థాయిలో దుకాణాలు దక్కలేదు. దీంతో ఇతరులకు వచ్చిన దుకాణాలలో వాటా లేకుంటే పెద్ద మొత్తంలో నగదు తీసుకోవాలని మంతనాలు జరుపుతున్నారు. తమతో సెటిల్ చేసుకున్న తరువాత దుకాణాలు తెరుచుకోవాలని బెదిరింపులకు దిగుతున్నట్టు వ్యాపారులు వాపోతున్నారు.
- అదేవిధంగా సత్తెనపల్లి నియోజకవర్గంలో దుకాణాలుదక్కిన వారితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసిన ఓ ముఖ్యనేత ఒక్కో దుకాణానికి రూ.30 లక్షలు టీడీపీకి చెందిన కాంట్రాక్టర్‌కు ముట్టజెప్పాలని ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని తేల్చిచెప్పినట్లు భోగట్టా.
- చిలకలూరిపేట పరిధిలో స్థానికేతరులు, ఎమ్మెల్యే వర్గం కాని వారికి దక్కిన దుకాణాలలో 50 శాతం వాటా ఎమ్మెల్యే చెప్పినవారికి ఇవ్వాలని ద్వితీయ శ్రేణి నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో ఒక్కో దుకాణం నుంచి తనకు 20 శాతం పెట్టుబడిలేని వాటా ఇవ్వాలని హుకుం జారీ చేశారట. ఈ వ్యవహారం చక్కదిద్దేందుకు విజయవాడకు చెందిన మద్యం వ్యాపారికి అప్పగించారు. ఇదే తంతు మిగిలిన నియోజకవర్గాలలో సైతం కొనసాగుతున్నట్టు సమాచారం. ఒక ఎమ్మెల్యేను చూసి మరో ఎమ్మెల్యే తామేమి తక్కువేమి కాదంటూ వ్యాపారులను బెదిరించి కప్పం కట్టించుకుంటున్నారు.

పవర్ లిఫ్టర్ సాదియాకు ఘనస్వాగతం



సాదియాకు స్వాగతం పలుకుతున్న పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విమానాశ్రయం(గన్నవరం): దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన షేక్ సాదియా అల్మాస్‌కు మంగళవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పోటీలు ముగిసిన అనంతరం హైదరాబాద్ మీదుగా ఆమె మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సాదియాకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.విజయ్‌భాస్కర్, కార్యదర్శి, కోచ్ షేక్ సంధాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.భాస్కరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి ఎండీ సయ్యద్, కుటుంబసభ్యులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో దేశం తరపున నాలుగు బంగారు పతకాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెట్ లిఫ్ట్ మూడు విభాగాలతో పాటు 460 కిలోల బరువులు ఎత్తి ఓవరాల్ విభాగంలో కూడా బంగారు పతకాన్ని గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ విజయంలో తన తండ్రి, కోచ్ షేక్ సంధాని, కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రోత్సాహం, పవర్ లిఫ్టింగ్ ఏపీ, గుంటూరు జిల్లా అసోసియేషన్‌ల సహకారం మరువలేనిదన్నారు. భవిష్యత్‌లో కూడా దేశానికి మరిన్ని పతకాలు సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

బాధితులకు ప్రారంభమైన చెల్లింపులు

- కొనసాగుతున్న విచారణ
- పలు విషయాలపై ఇంకా రాని స్పష్టత



చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు బ్రాంచి

చిలకలూరిపేట: ఐసీఐసీఐ బ్యాంకు చిలకలూరిపేట బ్రాంచిలో జరిగిన కుంభకోణానికి సంబంధించి బాధిత ఖాతాదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం ఎట్టకేలకు ప్రారంభమైంది. దీంతో గత రెండు వారాలుగా తీవ్ర ఆందోళన, మనోవేదనకు గురవుతూ వస్తున్న వారికి ఊరట లభించినట్లయింది. 2021 నుంచి చిలకలూరిపేట శాఖలో బ్రాంచి మేనేజర్‌గా వ్యవహరించిన దూడ నరేష్ చంద్రశేఖర్ పలు అవకతవకలకు పాల్పడ్డాడు. బ్యాంకు ఖాతాదారులకు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, బంగారు రుణాలకు సంబంధించి మోసాలకు పాల్పడ్డాడు. పలువురికి ఫేక్ డిపాజిట్ బాండ్లు ఇవ్వడం, బ్యాంకులో డబ్బులు ఫిక్స్‌డ్ చేయకుండానే వారి ఖాతాలకు నెలనెలా వడ్డీ జమ చేయడం, డిపాజిట్లపై ఓవర్ డ్రాఫ్టులు తీసుకొని వేరే ఖాతాలకు మళ్లించటం, బంగారం రుణాలకు సంబంధించి అసలైన వారు కాకుండా ఇతరుల పేరుమీద లోన్ తీసుకోవడం వంటి అవకతవకలకు పాల్పడ్డాడు. ఈ విషయాలన్నీ ఈ నెల 3వ తేదీన వెలుగు చూడటంతో మోసపోయిన ఖాతాదారులు బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. దీంతో విచారణ చేపట్టిన బ్యాంకు ఉన్నతాధికారులు విషయాన్ని సీఐడీకి ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీఐడీ అడిషనల్ ఎస్పీ సీహెచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో బృందం ఈ నెల 10వ తేదీన బ్యాంకులో విచారణ నిర్వహించారు. వారి విచారణలో 72 మంది ఖాతాదారులకు సంబంధించి రూ. 28 కోట్లు గోల్‌మాల్ జరిగినట్లు నిర్ధారించారు. పూర్వ బ్యాంకు మేనేజర్ మరో ఇద్దరితో కలసి ఈ కుంభకోణానికి పాల్పడినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మోసపోయిన ఖాతాదారుల నుంచి ఫిర్యాదులను బ్యాంకు ఉన్నతాధికారులు స్వీకరించారు. ఈ విషయమై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని, నిజమైన క్లెయిమ్‌లు కలిగి ఉన్న ఖాతాదారులు నష్టపోకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అలా స్వీకరించిన జాబితా నుంచి విడతల వారీగా రోజుకు కొంతమంది చొప్పున బ్యాంకుకు పిలిపించి వారి ఖాతాలను సెటిల్ చేయడం ప్రారంభించారు.

ప్రస్తుతం పక్కాగా ఆధారాలు ఉన్నవారికే..!

ఈ నేపథ్యంలో మంగళవారం కొంతమందిని బ్యాంకుకు పిలిపించి వారి ఖాతాలకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు పలువురు ఖాతాదారులు తెలిపారు. అయితే ఫేక్ బాండ్లు పొందిన వారికి సంబంధించి ఇంకా కొంత స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం పక్కాగా ఆధారాలు ఉన్న వాటికి సంబంధించిన చెల్లింపులు మాత్రం వారి సేవింగ్ ఖాతాలలో జమ చేస్తున్నారు. ఇంకా బంగారు ఆభరణాలపై రుణాలలో జరిగిన అవకతవకలకు సంబంధించి స్పష్టత రావాల్సి ఉంది. ఇదే విషయాన్ని బ్యాంకు పీఆర్‌ఓ కార్తికేయను వివరణ కోరగా, ప్రస్తుతం స్పష్టమైన ఆధారాలు ఉన్నవారికి చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన అంశాలకు సంబంధించి పూర్తి విచారణ అనంతరం బ్యాంకు తగు నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

మృతిపై సమగ్ర విచారణ జరపండి

- మృతుడు పులి శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల డిమాండ్
- వాడరేవు-పిడుగురాళ్ల హైవే కల్వర్టు వద్ద ఆందోళన



శ్రీనివాసరావు మృతిపై విచారణ జరిపించాలని ఆందోళన చేస్తున్న బంధువులు

చీరాల టౌన్: అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, బీసీ నాయకుడు పులి శ్రీనివాసరావు (45) మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని.. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కీర్తివారిపాలెం సిటీ ఫారెస్ట్ వద్ద నిర్మిస్తున్న 167 ఏ వాడరేవు-పిడుగురాళ్ల హైవే కల్వర్టు వద్ద శ్రీనివాసరావు మృతదేహం లభ్యమైన స్థలం వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈనెల 13న అనుమానాస్పదంగా మృతి చెంది కల్వర్టులో పడి ఉన్న పులి శ్రీనివాసరావు మృతికి గల కారణాలను త్వరగా వెలికి తీసి పోలీసులు, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. మృతుడు వివాదాలకు దూరంగా ఉండటమే కాకుండా, గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న తరుణంలో మృతిచెంది ఉండటం తమకు అనుమానాలను రేకెత్తిస్తుందన్నారు. పోలీసులు కేసును త్వరగా విచారించి నిజానిజాలు తెలపాలని డిమాండ్ చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేసి ఘటనలకు గల కారణాలను తెలపి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, కీర్తివారిపాలెం, వాకావారిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు.

ఇవి కనపడవ?

- ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు
- మార్చిలోనే ముగిసిన అనుమతులు
- పడవలపై మోటారు బైకులు, పశువులు సైతం తరలింపు
- నిత్యం పల్నాడు-ఎన్టీఆర్ జిల్లాల మధ్య రాకపోకలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కృష్ణానదిపై యథేచ్ఛగా అనధికార పడవలు

కృష్ణానదిపై నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ అనధికార పడవలు యథేచ్ఛగా నడుస్తున్నాయి. అసలే ఇటీవల కురిసిన వర్షాలు, వచ్చిన వరదతో నది ఉధృతంగా పొంగిపొర్లి ప్రవహిస్తోంది.. ఇటువంటి పరిస్థితిలో ఎటువంటి అనుమతులు, రక్షణ చర్యలు లేకుండా మనుష్యులు, పశువులు, బైక్‌లు, వస్తు సామగ్రిని ఈ దరి నుంచి ఆ దరికి చేరవేస్తూ.. సొమ్ము చేసుకుంటూ.. భద్రతను గాలికి వదిలేస్తున్నారు. అనుమతుల సమయం ముగిసి ఏడు నెలలవుతున్నా.. నిత్యం ప్రమాదకరంగా పడవలు తిరుగుతున్నా.. పట్టించుకుని ఆపివేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై పడవలు అనధికారికంగా నడుస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులుగానీ, నిబంధనలు గానీ పాటించకుండా నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా పడవలు నడుపుతున్నారు. ఓవర్‌లోడ్, బైకులు, పశువులను కూడా పడవలపై ఎక్కిస్తున్నారు. ప్రయాణికులు ప్రమాదం అని తెలిసినా సమయం ఆదా, వ్యయం తక్కువ అవుతాయన్న కారణంగా తప్పని పరిస్థితులలో పడవలను ఆశ్రయిస్తున్నారు. నిత్యం నదిపై ఇవి తిరుగుతున్నా.. ప్రమాదమని తెలిసినా.. వీటిని అడ్డుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు.

మార్చితోనే ముగిసిన అనుమతులు..

పల్నాడు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాకు కృష్ణానదిపై పడవలు నడుపుకొనేందుకు నదికి రెండు వైపుల ఉన్న రెండు జిల్లాల జిల్లా పరిషత్ కార్యాలయాలలో ఏడాదికి ఒక జిల్లా చొప్పున బహిరంగ వేలం నిర్వహిస్తూ ఉంటారు. ఈ ఏడాది మార్చి 31తో గత ఏడాది వేలం కాలం పూర్తయింది. తిరిగి వేలం నిర్వహించాల్సి ఉండగా సాధారణ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించలేకపోయారు. వచ్చే ఏడాది అంటే మార్చి 31, 2025 వరకు పడవ నడుపుకొనే హక్కులకై గుంటూరు జిల్లా పరిషత్ హాలులో ఈ ఏడాది జూన్ 27న బహిరంగ వేలం నిర్వహించేందుకు ప్రకటన ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఆశించిన ధర రాకపోవడంతో వేలంను వాయిదా వేశారు. మళ్లీ ఆగస్టు 7న నిర్వహిస్తామని మరో ప్రకటన ఇచ్చారు. అప్పుడు కూడా పడవ నిర్వాహకులంతా సిండికేట్ అవడం, సరైన ధర రాకపోవడంతో మళ్లీ వాయిదా వేశారు. అప్పటి నుంచి నదిపై పడవులు నడుపుకొనేందుకు ఎలాంటి హక్కులు ఎవరికీ ఇవ్వలేదు.



మాదిపాడు పడవరేవులో అనధికారికంగా ప్రయాణికులు, మోటారు బైకులతో వెళుతున్న పడవ

మండలంలో ఐదు పడవ రేవులు

అచ్చంపేట మండలంలో 5 పడవ రేవులున్నాయి. ఈ రేవుల ద్వారా పల్నాడు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాకు పడవలద్వారా ప్రయాణికులను నది దాటించవలసి ఉంది. మండలంలోని చామర్రు నుంచి ఎన్టీఆర్ జిల్లా కాసరబాదకు, చింతపల్లి నుంచి ఇస్తేపల్లికి, గింజుపల్లి నుంచి పవిత్ర పుణ్యక్షేత్రమైన వేదాద్రికి, తాడువాయి నుంచి రామన్నపేటకు, మాదిపాడు నుంచి ముక్త్యాలకు పడవలను నడపవలసి ఉంది.

భగ్గుమన్న వర్గ విభేదాలు

మాదిపాడు గ్రామంలో అధికార పార్టీలో రెండు వర్గాలున్నాయి. ఒక వర్గానికి చెందిన వారు ఎలాంటి అనుమతులు లేకుండా పడవలు నడుపుతున్నారు. దీంతో రెండోవర్గం వారు తమకూ వాటా కావాలని పట్టుబట్టారు. లేదా గ్రామంలో ప్రధానమైన ఐదు వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలు ఉండటంతో ఆయా వర్గాలకు సంబంధించిన దేవాలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి పడవలపై వచ్చే ఆదాయాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకు కూడా నిర్వాహకులు ససేమిరా ఒప్పుకోలేదు. పడవలు మావే, నిర్వహించేదీ మేమే కాబట్టి వచ్చే ఆదాయంలో మేం మూడు వంతులు తీసుకుని ఒక వంతును గ్రామాభివృద్ధికి ఇస్తామన్నట్లు సమాచారం. దీనిపై గత రెండు రోజులుగా సుదీర్ఘ చర్చలు జరుగుతున్నాయి.

సిబ్బందిని అప్రమత్తం చేశాం

మాదిపాడువద్ద కృష్ణానదిపై అనధికారికంగా పడవలు నడుపుతున్నట్లు మాకు సమాచారం అందగానే వీఆర్‌ఓ, వీఆర్ఏలను అప్రమత్తం చేసి వెంటనే నిలిపి వేయించమని ఆదేశాలు జారీచేశాం. అనుమతులు వచ్చేంతవరకు నదిలో పడవలు తిప్పిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీనివాసరావు, తహసీల్దార్, అచ్చంపేట

జనావాసాల నడుమ మద్యం దుకాణం

తొలగించాలని వినతిపత్రాలు అందించిన స్వర్ణ గ్రామస్తులు

కారంచేడు: నిత్యం మహిళలు, పిల్లలు తిరుగుతూ రద్దీగా ఉండే చీరాల-ఇంకొల్లు ప్రధాన రహదారిని ఆనుకొని మద్యం షాపును ఏర్పాటు చేస్తే తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన ఒకటో వార్డు ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గ్రామస్తులు మంగళవారం చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావును కలసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా కారంచేడు ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత, ఎస్ఐ వి.వెంకట్రావులకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మద్యం లాటరీలో షాపు దక్కించుకున్న వ్యక్తి షాపును ఏర్పాటు చేయనున్నారనే సమాచారం ఉందన్నారు. గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఈ మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వలన ఆ ప్రాంతంలో నివాసముండే కుటుంబాలు, మహిళలు, చిన్నపిల్లలు అవస్థలు పడాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి దుకాణాన్ని ఊరికి చివరన, జనసంచారం లేని ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సూచించారు. అధికారులు సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

క్లుప్తంగా

చిరు వ్యాపారులకు రూ.10 నాణాలు పంపిణీ



నరసరావుపేట: పట్టణంలోని చిరు వ్యాపారస్తులు సుమారు రూ.30 వేలు విలువైన పది రూపాయల నాణాలను మంగళవారం పంపిణీ చేశారు. గత కొన్నిరోజులుగా పది, ఐదు రూపాయల నోట్లు చినిగిపోయి, కొత్తవి రాక చిల్లరతో వ్యాపారస్తులు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బీఐ ఎస్ఆర్‌టీ బ్రాంచ్‌లను సంప్రదించి నాణాలను సేకరించారు. బ్యాంకు సిబ్బందితో కలిసి మెయిన్ రోడ్ లోని వినాయకుని గుడి ఎదురుగా కౌంటర్ ఏర్పాటు చేసి రూ.10లు కాయిన్లు చిరు వ్యాపారులకు అందజేశారు. బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ప్రారంభించాలి

కాంట్రాక్ట్ లెక్చరర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు

బెల్లంకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిని వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు వై. రమేష్ బాబు డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పసుపు రంగు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3,618 మంది అధ్యాపకుల క్రమబద్ధీకరణ నిలిపివేశారని, రెగ్యులరైజేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలు నాయక్, అధ్యాపకులు లక్ష్మీ సులోచన, రత్నకుమారి, సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సిఫార్సుతో.. ఉద్యోగాలా?

- కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
- నెల్లూరుతో పాటు అన్నీ పురపాలక సంఘాల్లో కార్మికులను తొలగించారు
- కక్షసాధింపులు ఉండవని చెబుతూనే అమలు చేస్తున్నారు
- హెచ్చరించిన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు



రిలేదీక్షలు చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు మద్దతు పలికిన సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: ఉద్యోగం కావాలంటే ఎమ్మెల్యే సిఫార్సు కావాలని అధికారులు మాట్లాడడం సిగ్గుచేటుగా ఉందని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తొలగించిన ఉద్యోగులను కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. స్థానిక మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న 55 మంది ఉద్యోగులు, కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ చేపట్టిన నిరసన మంగళవారంతో 13 రోజుకు చేరుకుంది. మంగళవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో కూర్చున్న ఉద్యోగులు, కార్మికులకు వారు పూలమాల వేసి దీక్షలు ప్రారంభింప చేశారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ కూటమిలో భాగస్వామ్యమైన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కార్మికులు ఉద్యోగుల ఆనందం కొన్ని రోజులకే ఆవిరైందన్నారు. అత్తెసరుగా ఉన్న వేతనాలు పెంచి కనీస వేతనాలు అమలు చేస్తారన్న ఆశలు అడియాసలు చేస్తూ ఉద్యోగాల నుంచి తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాజకీయ వేధింపులు తమ ప్రభుత్వంలో ఉండవని ప్రకటించడం కేవలం ప్రచార ఆర్భాటం కోసమేనని, క్షేత్ర స్థాయిలో రాజకీయ వేధింపులు వారికి తెలిసే జరుగుతున్నాయన్నారు. నోటీసులు ఇవ్వకుండా నోటిమాటపై ఉద్యోగులను తొలగించడం సరైన విధానం కాదని, ఇది పూర్తిగా చట్ట వ్యతిరేకమని అన్నారు.

ప్రకాశం జిల్లా మార్కాపురంలో 22 మంది ఉద్యోగులను రాజకీయ వేధింపులలో భాగంగా తొలగించారని, నెల్లూరు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలో ఉద్యోగులను కార్మికులను తొలగించారని, వారి వేతనాలు చెల్లించకుండా వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ముత్యాలరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానాలకు భిన్నంగా ఉద్యోగులపై కార్మికులపై వైఎస్సార్‌సీపీ చెందిన వారని నెపంతో తొలగించడం సరైంది కాదన్నారు. ఒకవైపు ఇది మంచి ప్రభుత్వం అంటూ తమకు తామే ప్రచారం చేసుకుంటూ దొడ్డిదారిన కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్, మున్సిపల్ కార్మికులను ఉద్యోగులను కుట్రపూరితంగా తొలగించడం సరైన విధానం కాదన్నారు. ఇదే విధంగా రాజకీయ వేధింపులకు పాల్పడితే 2014లో పట్టిన గతే రానున్న ఎన్నికలలో పడుతుందని హెచ్చరించారు. తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ నిరసన దీక్షలు చేసేవారిని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి దుశ్చర్యలు మానుకోకపోతే పురపాలక సంఘ కార్యాలయం, ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. యూనియన్ ఇంజినీరింగ్ విభాగం పట్టణ అధ్యక్షులు షేక్ చిన్న అల్లాబక్షు, ఉద్యోగులు బత్తుల నాగమల్లేశ్వరి, శివరాత్రి రమాదేవి, షేక్ మహబూబ్ సుభాని, షేక్ మహబూబ్ బాషా, షేక్ సైదా, పోలూరి రమణ, షేక్ మహబూబ్ సుభాని, అక్కి పద్మ పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీ లొల్లి



భీమవరంలో పోలీసుల సాయంతో ఫ్లెక్సీ తొలగిస్తున్న టీడీపీలోని మరో వర్గం శ్రేణులు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీలో ఫ్లెక్సీల లొల్లి నెలకొంది. మండలంలోని భీమవరం గ్రామంలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మాజీ స్పీకర్ డా.కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని టీడీపీలోని ఒక వర్గం వారు ప్రయత్నాలు చేపట్టారు. అయితే మరోవర్గం వారు అడ్డుకోవటంతో విషయం ముఖ్య నేత దృష్టికి వెళ్ళింది. ముఖ్య నేత ఆదేశాల మేర పోలీసుల సాయంతో ఫ్లెక్సీలను తొలగించారు. 40 సంవత్సరాలు పాటు తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన డా.కోడెల శివప్రసాదరావు ఫ్లెక్సీని బలవంతంగా తొలగించటం పట్ల కోడెల వర్గీయులు ఆందోళన వ్యక్తం చేశారు. చంద్ర బాబునాయుడు టీడీపీ అధికారంలోకి వచ్చాక కోడెల స్మృతివనం ఏర్పాటు చేస్తామని చెప్పి, కనీసం ఆ దిశగా అడుగులు వేయకపోగా వర్ధంతి సందర్భంగా అభిమానంతో ఆయనను స్మరిస్తూ ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు తొలగించటం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోడెల చేసిన అభివృద్ధి గురించి ప్రజలు మర్చిపోయేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శలు గుప్పిస్తున్నారు. టీడీపీలోని అంతర్గత పోరు మరో ఫ్లెక్సీల రూపంలో వెల్లడి కావటంతో, ఈ పరిణామంపై ఆయన వారసులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు వెంకటేష్

అచ్చంపేట: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వేల్పూరు-క్రోసూరు గ్రామాల మధ్య గల బొగ్గవరపు గురవయ్య కళాశాల వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన కె.వెంకటేష్(24) బైకుపై క్రోసూరు వెళుతుండగా కళాశాల సమీపాన ట్రాక్టరు ట్రక్కును ఢీకొన్నాడు. కిందపడి అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం



పర్వీన్ మృతదేహం

ప్రత్తిపాడు: హైవేపై ముందు వెళుతున్న కారును వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టడంతో బాలిక అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరు అరుంధతీనగర్‌కు చెందిన మహమ్మద్ రజాక్, అప్ప జబీన్‌ల కుమార్తె పర్వీన్ (16) మంగళవారం మధ్యాహ్నం సమీపంలోని స్నేహితురాలిని కలిసేందుకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి స్కూటీ తీసుకుని బయటకు వచ్చింది. బాలిక గుంటూరు నగరం దాటి పదహారవ నంబరు జాతీయ రహదారిపై చిలకలూరిపేట వైపు వెళ్లింది. అదే సమయంలో బోయపాలెం పార్వతీదేవి గుడి సమీపంలో ముందు నెమ్మదిగా వెళుతున్న కారును వెనుక నుంచి స్కూటీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన పర్వీన్ అక్కడికక్కడే చనిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె. నాగేంద్ర ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. స్థానికులు రుద్ర చారిటబుల్ ట్రస్టుకు సమాచారం అందించడంతో వారు అంబులెన్స్‌లో బాలిక మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలిగా రామలక్ష్మీ నాయుడు



నరసరావుపేట: దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలిగా కాసా రామలక్ష్మీ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షులు బీవీ రాజు ద్వారా మంగళవారం నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆమె వెల్లడించారు. జిల్లాలో మహిళలు, బాలికలకు రక్షణగా నిలుస్తామన్నారు. వారి సంక్షేమానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం పాటుపడటమే తమ సంస్థ లక్ష్యమన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో బాపట్ల విద్యార్థిని ప్రతిభ



మెడల్స్ సాధించిన సీహెచ్ అవిజ్ఞ

బాపట్లటౌన్: బాపట్ల ప్రాంతానికి చెందిన విద్యార్థిని స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని తన సత్తా చాటింది. ఏడు మెడల్స్ సాధించింది. బాపట్ల పట్టణానికి చెందిన సీహెచ్ అవిజ్ఞ కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా వ్యాపారాల నిమిత్తం మస్కట్ దేశంలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం అవిజ్ఞ 9వ తరగతి చదువుతున్నారు. చిన్నతనం నుంచే అవిజ్ఞకు స్విమ్మింగ్ చేస్తుంటారు. ఈనెల 11 నుంచి 14 వరకు భువనేశ్వర్‌లో జరిగిన సీబీఎస్ఈ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో అండర్-19 విభాగంలో పాల్గొని ఏడు మెడల్స్‌ను సొంతం చేసుకుంది. 50 మీటర్ల ఫ్రీ స్టైల్ పోటీలో సిల్వర్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలో సిల్వర్, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ పోటీలో బ్రాంజ్ మెడల్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలో బ్రాంజ్ మెడల్, 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలో బ్రాంజ్ మెడల్, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే పోటీలో సిల్వర్, 100 మీటర్ల మేడ్లీ రిలే పోటీలో సిల్వర్ మెడల్ సాధించి బాపట్ల సత్తా చాటారు. పోటీల్లో వరుసగా మెడల్స్ సాధించిన క్రీడాకారిణికి శిక్షణ ఇచ్చిన వారితోపాటు, క్రీడాకారులు, తల్లిదండ్రులను క్రీడల నిర్వాహకులు అభినందించారు.

ఐకేపీ యానిమేటర్ల తొలగింపునకు రంగం సిద్ధం

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరా క్రాంతి పథంలో పనిచేస్తున్న యానిమేటర్ల తొలగింపుకు రంగం సిద్ధం చేశారు. వీరిలో దీర్ఘకాలంగా పనిచేసిన వారిని సైతం రాజకీయ నేపథ్యంలోనే తొలగింపు చర్యలు చేపట్టారు. మండలంలో మొత్తం 24 మంది యానిమేటర్లగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 17 మంది సుమారు 15 సంవత్సరాలు పై బడి రాజకీయాలకు అతీతంగా పనిచేసిన వారు ఉన్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తమ వారినే యానిమేటర్లుగా నియమించుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేపట్టారు. ఆ మేర నియోజకవర్గ ముఖ్యనేత పై తీవ్రస్థాయిలో ఒత్తిళ్ళు చేశారు. రెండు నెలల నుంచి మల్లగుల్లాలు పడుతూ చిట్టచివరకు జాబితాలను సిద్ధం చేసి ఐకేపీ మండల స్థాయి అధికారులకు అందించారు. అయితే ఈ జాబితా రూపకల్పన తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు దారి తీస్తున్నాయి. గ్రామ సర్పంచ్ కి, టీడీపీ గ్రామ అధ్యక్షుడికి తెలియకుండానే టీడీపీ సానుభూతిపరురాలిని తొలగించి మరో మహిళకు యానిమేటర్ పోస్టు ఇవ్వటంపై ఆ గ్రామ టీడీపీ నాయకులు మండల స్థాయి నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. ఎవరి ప్రమేయం లేకుండా ఇష్టానుసారంగా జాబితాలో పేర్లు ప్రకటించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో తమ సామాజిక వర్గాన్ని కాదనుకొని టీడీపీకి మద్దతుగా పని చేసినా మా పోస్టు ఎలా తొలగిస్తారంటూ మరో గ్రామానికి చెందిన వారు మండల స్థాయి నాయకులను ప్రశ్నిస్తున్నారు. యానిమేటర్ల నియామకం తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలను మరో మారు బహిర్గతం చేసినట్లయింది.

చెస్ పోటీలు ప్రారంభం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): లీలావతి మెమోరియల్ ఏపీ అండర్-15 బాలబాలికల చెస్ పోటీలు మంగళవారం స్థానిక నెక్స్‌జెన్ స్కూల్లో ప్రారంభమయ్యాయి. పోటీల నిర్వాహకుడు వైవీకే చక్రవర్తి మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది పాల్గొంటారన్నారు. పోటీలను నెక్స్‌జెన్ స్కూల్ కోఆర్డినేటర్ లక్ష్మీగాయత్రి, సీఈఓ శ్రీకాంత్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్, నిర్వహణ కార్యదర్శి ఫణికుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కృష్ణ మృతదేహం

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కృష్ణ(35) మిర్చియార్డు వద్ద కూలీ పనులు చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో హైవేలోని వై జంక్షన్ సమీపంలో నారాయణాద్రి కోల్డ్ స్టోరేజ్ ఎదురున్న షాప్స్ వద్ద మృతి చెంది పడి ఉన్నాడని స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలికి పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్పోర్ట్స్ సొసైటీ నిర్వహణ కార్యదర్శిగా సురేష్‌బాబు



గుంటూరు వెస్ట్(క్రీడలు): కన్నెగంటి హనుమంతు మెమోరియల్ స్పోర్ట్స్ సొసైటీ రాష్ట్ర నిర్వహణా కార్యదర్శిగా చిమటా సురేష్‌బాబును నియమించినట్లు రాష్ట్ర కరస్పాండెంట్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రిటైర్డ్ ఎస్పీ చక్రపాణి ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.రత్నస్వామి పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో మన్నన పొందాలి

విద్యుత్ ఎస్ఈ విజయకుమార్



మాట్లాడుతున్న ఎస్ఈ విజయకుమార్, ఈఈ రాంభొట్ల

మాచర్ల: పల్నాడు జిల్లాలో విద్యుత్ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) డాక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మాచర్ల విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్.రాంభొట్ల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్ఈ విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. పీఎం సూర్యఘర్ ప్రోగ్రామ్, తదితర స్కీంలకు సంబంధించిన చర్యలు తీసుకొని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు, పలు రకాల విద్యుత్ సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న రూ. కోట్ల బకాయిలు ప్రత్యేక డ్రైవ్ ద్వారా వసూలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత ఇంజినీర్లు కృషి చేయాలన్నారు. లైన్‌మెన్‌లు, అసిస్టెంట్ ఇంజినీర్ల సహకారంతో పనులు పూర్తి చేయాలన్నారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న విద్యుత్ సంబంధించిన పనులపై సమీక్షించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఆగిపోయిన ఇసుక రీచ్‌ల ప్రారంభాలు

అచ్చంపేట: మండలంలో మంజూరైన నాలుగు ఇసుక రీచ్‌లను బుధవారం ప్రారంభించవలసి ఉండగా వాయిదా పడ్డట్లు విశ్వసనీయ సమాచారం. సక్రమమైన విధానంలో టెండర్లు వేయకపోవడం, తప్పులతో టెండర్లు ఉండటం వల్లనే మరో రెండు మూడు రోజులు వాయిదా పడ్డట్లు విశ్వసనీయ సమాచారం. మంజూరైన నాలుగు ఇసుక రీచ్‌లలో కోనూరులో 3930 హెక్టార్ల విస్తీర్ణంలో 39,300 క్యూబిక్ మీటర్లు, అంబడిపూడి-1లో 4480 హెక్టార్ల విస్తీర్ణంలో 48,400 క్యూబిక్ మీటర్లు, అంబడిపూడి-2, అంబడిపూడి-3 రీచ్‌లలో ఒక్కొక్క రీచ్‌లో 4830 హెక్టార్ల విస్తీర్ణంలో 48300 క్యూబిక్ మీటర్లు చొప్పున నదిలో ఇసుకను త్రవ్వి స్టాక్ పాయింట్‌కు చేర్చి వినియోగదారులకు సరఫరా చేయవలసి ఉంది. ఇందుకు గాను టెండర్లు పిలిచారు. అంబడిపూడి-1,2, కోనూరు రీచ్‌లకు వేసిన టెండర్లు సక్రమంగా లేకపోవడంతో జిల్లా కలెక్టరు రీకాల్ చేసినట్లు తెలిసింది. అంబడిపూడి-3కి నదిలో నుంచి ఇసుక సరఫరా కేంద్రానికి క్యూబిక్ మీటరుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రు.108లు. టెండరుదారు లీస్ట్ ప్రైస్‌గా టెండరులో రూ.54 కోట్ చేయడంతో జిల్లా కలెక్టరు ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారన్న సమాచారం. దీనిపై సదరు టెండరు దారు తనకు ఉన్న అపారమైన అనుభవం, లేటెస్ట్ ఎక్విప్‌మెంట్ల సహాయంతో సరఫరా చేయగలనని చెప్పారట. ఆ టెండరును కూడా ప్రస్తుతానికి పక్కనపెట్టినట్లు విశ్వసనీయసమాచారం. ఏది ఏమైనా బుధవారం నుంచి ప్రారంభం కావలసిన నాలుగు ఇసుక రీచ్‌లు వాయిదా పడటంవల్ల ఇసుక కార్మికుల కష్టాలు మరికొన్ని రోజులు కొనసాగనున్నాయి.

రైల్వేలో విజయవంతంగా స్వచ్ఛతా కార్యక్రమాలు



డీఆర్ఎం కార్యాలయంలో పారిశుధ్య పనులను చేపట్టిన డీఆర్ఎం ఎం.రామకృష్ణ, సిబ్బంది

లక్ష్మీపురం: స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేశామని డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. కార్యాలయాల పరిశుభ్రతను ప్రోత్సహించామని చెప్పారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో స్వచ్ఛత పఖ్వాడా ప్రచార ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మొక్కలను నాటారు. అక్టోబర్ 1- 15వ తేదీ వరకు స్వచ్ఛతా పఖ్వాడా క్లీన్‌నెస్ డ్రైవ్ నిర్వహించామన్నారు. పాఠశాలల విద్యార్థులు, స్కౌట్ అండ్ గైడ్స్, ఎన్‌జీఓలు తదితరులతో పాటు అధికారులు, సిబ్బంది చురుగ్గా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. డివిజన్ పరిధిలోని 56 రైల్వే స్టేషన్‌లలో ఈ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. 500 కిలోమీటర్ల ట్రాక్ కూడా శుభ్రం చేశామన్నారు. 4,710 మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్ఎం సైమన్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్, ఆయా విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా దూరవిద్య పరీక్షలు

నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తెలిపారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో మంగళవారం వర్సిటీలో జరిగిన ప్రత్యేక సమావేశానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలను మంచిగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాలు, దూరవిద్యా కేంద్రం అధికారులు కృషి చేయాలని సూచించారు. వర్సిటీ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారుల సహకారం ఎంతో కీలకమన్నారు. ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం ద్వారా పీజీలో 10 సైన్స్ కోర్సుల నిర్వహణకు యూజీసీ నుంచి అనుమతి లభించిందని, తద్వారా విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. దూరవిద్యా కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ మాట్లాడుతూ ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం ద్వారా ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ కోర్సుల పరీక్షలు మొదలు అవుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. పర్యవేక్షణకు అబ్జర్వర్, రీజినల్ కోఆర్డినేటర్, ప్రత్యేక స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లు వ్యక్తం చేసిన సందేహాలను వర్సిటీ అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వే ట్రాక్ మరమ్మతులు



కుంగిన ప్రదేశంలో తూములు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



పొక్లయిన్‌లతో ట్రాక్‌ను పునరుద్ధరిస్తున్న దృశ్యం

పొన్నూరు: మండల పరిధిలోని మాచవరం రైల్వే స్టేషన్ సమీపంలో వర్షం కారణంగా కుంగిన రైల్వే ట్రాక్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాలను కలిపే ప్రధాన ట్రాక్ కావడంతో రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. సోమవారం చెన్నై నుంచి సికింద్రాబాద్‌కు వందే భారత్ కూడా అప్పికట్ల రైల్వే స్టేషన్‌లో నిలిపివేసిన విషయం తెలిసిందే. మంగళవారం వర్షం తగ్గడంతో రైల్వే ట్రాక్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ట్రాక్ కుంగిన ప్రదేశంలో భారీ సిమెంటు తూములను ఏర్పాటు చేశారు. ఈ లైన్‌లో రోజు సుమారు దాదాపు 70 రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని రైల్వే చీఫ్ ఇంజినీరు తెలిపారు. వాటికి అంతరాయం కలగకుండా మరో రెండు లైన్లను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే ట్రాక్‌లపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తామని అన్నారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి మరో రెండు రోజుల్లో ట్రాక్‌ను వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. సికింద్రాబాద్, విజయవాడ డివిజన్ల రైల్వే ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. సుమారు 500 మంది కార్మికులు పని చేస్తున్నారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ



తడిసిన మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ

వేటపాలెం: తుఫాన్ నేపథ్యంలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సరైన సలహాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ సూచించారు. మంగళవారం మండలం పరిధిలోని అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం ప్రాంతాల్లో వర్షాలకు తడిచిన మినుము, వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంకా రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం మినుము 16 ఎకరాల్లో, వేరుశనగ 30 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. రెండు రోజుల తరువాత మళ్లీ పంట నష్టం అంచనా వేస్తామని తెలిపారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్, వీఏఏలు, సిబ్బంది ఉన్నారు.